# జీవరాగం

ఏమైందో తెలీదు. చాలా సేపట్నుంచి ట్రెయిన్ ఆగి పోయింది. చదువుతున్న నవల్ని విసుగ్గా పక్కన పెట్టి కిటికీలోంచి బైటికి చూశాను. దూరపు కొండలు నునుపు దేరి కనిపిస్తున్నాయి. అత్రుత పట్టలేని కొందరు ట్రెయిన్ దిగి అటూ ఇటూ తిరుగుతు న్నారు. బోర్‌గా అన్పించి, ఏం తోచక పర్స్ తెరిచి చూశాను. ఈ ప్రయాణానికి కారణ మైన ఆ ఉత్తరం మళ్లీ చేతికి తగిలింది.

డియర్ శృతీ!

నీకు ఉత్తరం రాసి, చాలా నాళ్లయిపోయింది కదూ! పది రోజుల క్రితం కండొలె న్సెస్ చెబుతూ నీ ఉత్తరం వచ్చేసరికి నేను మనుషుల్లో లేను. చాలా సివియర్‌గా వచ్చిన హార్ట్ ఎటాక్‌తో అపోలోలో ఉన్నాను. నిన్న ఇంటికి వస్తూనే నా టేబుల్ మీదున్న నీ ఉత్తరం చూడగానే ఏ అధారం లేకుండా నదిలో కొట్టుకుపోతున్న వాడికి పడవ అంచు దొరికి నంత రిలీఫ్ ఫీలయ్యాను.

ఎప్పుడూ లేనిది మూర్తి ఇలా ఎందుకు రాస్తున్నాడా అనుకుంటున్నావు కదూ! నలభై దాటిన ఈ మిడిలేజ్ ఎంత చెడ్డదో నాకిప్పుడిప్పుడే అర్థం అవుతోంది. చాల విష యాలు సమస్యలుగా మారిపోయి బాధిస్తున్నాయి. ఎవరితోనైనా చెప్పుకోవాలంటే ఆత్మా భిమానం, అభిజాత్యం అడ్డొస్తాయి. భార్యకు కూడా చెప్పలేని కొన్ని విషయాలు నా గుండెను పిండేస్తున్నాయి. బరువెక్కిపోయిన హృదయాన్ని తేలిక పరుచుకోవడానికే నీకీ ఉత్తరం.

శృతీ! ఈ సారోపుల్ మూడ్‌లో ఎమోషన్ తో వ్రాసేస్తున్నాననుకోకేం! నా చిన్న నాటి నేస్తానివీ, నా బలహీనతల్తో సహా నన్నర్థం చేసుకున్నదానివీ నువ్వు తప్ప నాకు దగ్గర వాళ్లెవ్వరూ లేరు. చివరికి క్లబ్బులో కూడా నా పోలీసు ఆఫీసరు వేషానికి స్నేహితులున్నారు తప్ప నాకోసం లేరు. నావాళ్లంతా నా ఖాకీ బట్టల కరుకు తనాన్నే చూస్తారు గానీ, నా హృద యపు ఆర్ద్రతని అవలోకించరు. నిజానికి నీకుత్తరం వ్రాయడానికింత ఉపోద్ఘాతం అవసరం లేదు. కానీ, ఈ వయసులో బావురుమని ఏడ్చెయ్యాలన్పిస్తున్న నన్ను పిచ్చివాడనుకుం టావేమోనని ఇదంతా వ్రాస్తున్నాను.

శృతీ! క్రితం నెల ఇదే రోజున మా అమ్మ నన్ను విడిచి వెళ్లిపోయింది. నన్ను పెంచ

డానికీ, చదివించడానికీ ఆమె ఎంత కష్టపడిందో నీకు తెలుసు. నన్ను కన్న మరుసటి రోజే భూమి తగాదాల్లో భర్తనీ, భూమినీ పోగొట్టుకొని, ఈ లోకంతో ఒంటరి పోరాటం చేసింది. ఒక్కగానొక్క బిడ్డననీ, నాకే లోటూ కలగ కూడదనీ ఆమె రక్తాన్ని నీరుగా మార్చి చెమటోడ్చింది. అలాంటి అమ్మను నేనేం చేసాను? వార్ధక్యంలో ఆ పల్లెలో ఒంటరిగా వదిలేశాను. కోటీశ్వరుడి కూతుర్ని చేసుకొని డబ్బుతో పాటు నా స్టేటస్‌ని పెంచుకున్నాననుకున్నానే తప్ప, నా కన్నతల్లికి అన్యాయం చేసి,నేను వీళ్లకి శాశ్వతమైన బానిసగా మారి పోయాననుకోలేదు.మా పాలరాతి భవనంలో ఆమె ఒక దిష్టిబొమ్మలా వుంటుందని భయపడ్డానే తప్ప, ఆమె పాలమనసుని విషపు చుక్కలా విరిచేసానని గ్రహించలేకపోయాను. ఏడాదికి ఒక్కసారి వెళ్లినా, నన్ను చూడగానే ఆమె కళ్లలో వెలిగే కోటి దీపాల కాంతితో నా అహాన్ని పెంచుకున్నాను తప్ప ఆమె పట్ల ఆత్మీయతను పెంచుకోలేక పోయాను .శృతీ! ఎవరి విలువైనా వాళ్లు అందుబాటులో వుంటే తెలియదు.

ఇక మీద ఆ కోటి దీపాల కాంతి ఎవరి కళ్లల్లో చూడను? ఈ భూమి మీద నేను మొదటి శ్వాస తీసుకునేటప్పుడు నా నోట్లో పాలు పోసిన నా తల్లికి ఆఖరిశ్వాస తీసుకునేటపుడు ఆమె నోట్లో తులసి నీళ్లయినాపోయలేక పోయిన దౌర్భాగ్యుణ్ణి నేను. ఈ బాధ నన్ను జీవితాంతం విడిచి పెట్టదు. ఎవరో ధర్మాత్ములు టెలిగ్రాం ఇచ్చి ఇంత దూరం నుంచి నన్ను పిలిపించే వరకూ అనాథ ప్రేతంలా ఆ పల్లెలోని పాత ఇంటి వాకిట్లో మిగిలి పోయిన మా అమ్మను చూసేక గాని నా తప్పు నాకు తెలియలేదు. నా అంత దుర్మార్గుడింకెవడుంటాడు? ఈ ఉత్తరం మీద పడి అక్షరాల్ని చెరిపేస్తున్న ఇవి కన్నీటి చుక్కలుకావు. నా గుండెను ముక్కలు ముక్కలుగా కోస్తున్న రక్తపు చుక్కలు. ఈ దుఃఖం తీరేలా అమ్మ ఒడిలో తల వాల్చి ఏడవాలని వుంది. కానీ, అమ్మెక్కడుంది?

అమ్మ తాలూకు సంస్కారాలన్నీ చేసి వచ్చి నాలుగు నాళ్లయినా కాలేదు. ఆ మూడ్ నుంచి నేనింకా కోలుకోనేలేదు. మా స్రవంతి తను ప్రేమించిన వాడిని రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్లిచేసుకోబోతున్నానంటూ నా గుండెల్లో డైనమైట్ పేల్చింది. ఆరోజే నాకు హార్ట్ ఎటాక్ వచ్చింది. వాళ్లడిగిందల్లా ఇస్తూ అపురూపంగా పెంచినా ఈ పిల్లలెందుకింత కఠినంగా వుంటారో! నా ప్రమేయం ఏమీ లేకుండా అది తన పెళ్లి తను చేసేసుకోవాలనుకుంది. ఇదేమైనా న్యాయమేనా? న్యాయాన్యాయాలు దాని కెందుకులే, అది నా కూతురు కదా!

ఇక వ్రాసే ఓపికలేదు, వుంటాను మరి! నిజానికి నాకు చచ్చిపోవాలన్పిస్తోంది.

నీ మిత్రుడు

సత్యమూర్తి

ఆరోజు ఉత్తరం చదవడం ముగిసే సరికి ఆర్తితో నా కళ్లు చెమ్మగిల్లాయి.

నా దృష్టిలో సత్యమూర్తి ఉత్త ప్రాక్టికల్‌మేన్. ఇంతటి బేలతనం అతనిలో వుందని నేనెప్పుడూ ఊహించలేదు.

సత్యమూర్తీ నేనూ ఒకే ఊళ్లో పుట్టి పెరిగాం. చిన్న తనం నుంచీ పోస్టు గ్రాడ్యుయేషన్ వరకూ కలిసే సాగింది మా చదువు. ఆ తర్వాత అతను సివిల్ సర్వీసెస్‌కి మద్రాసు వెళ్లడం, పిహెచ్.డి. కోసం నేను విశాఖలో వుండిపోవడం మమ్మల్నిద్దర్నీ విడదీసింది. అంత కన్నా, అతని ప్రాక్టికాలిటీయే మమ్మల్ని విడదీసిందంటే బావుంటుంది.

ఇన్నేళ్ల పరిచయంలోనూ అతని నుంచి ఇలాంటి ఉత్తరాన్ని నేనెప్పుడూ అందుకోలేదు. కష్టకాలంలో స్నేహితులు మరింత ఆత్మీయులుగా కన్పిస్తారు కాబోలు.. అతనిని వెంటనే చూడాలన్పించింది. చూసి ఓదార్చాలనిపించింది. ఉత్తరం మీది తారీఖు చూశాను. పది రోజులైంది పోస్టు చేయబడి. పోస్టల్ డిపార్టు మెంటుకొక నమస్కారం.

నేనింక ఆలస్యం చేయలేదు.

ప్రిన్సిపాల్‌గా నేను పనిచేస్తున్న కాలేజీలో బాధ్యతలు ఎక్కువే, వాటన్నిటినీ ఒక వారంపాటు వైస్ ప్రిన్సిపాల్‌కి అప్పగించి, టికెట్ రిజర్వు చేయించుకున్నాను. షాలిమార్స్‌లో ఆఫీసరుగా వున్న మా అన్నయ్య పాణి నేను వాళ్లింటికి వెళ్లడం లేదని ఎప్పటి నుంచో నిష్ఠూరం పోతున్నాడు. ఈ వంకన, వదిననీ, పిల్లల్నీ చూసి నట్లూ వుంటుంది. వస్తున్నానని టెలిగ్రాం కూడా ఇవ్వలేదు. మూర్తి ఆరోగ్యం బాగాలేదు కదా! స్టేషనుకు రమ్మని అతన్నెందుకు శ్రమపెట్టాలి? మూర్తికి స్రవంతి తప్ప కొడుకులు కూడా లేరు.

స్టేషను నుంచి డైరెక్టుగా అన్నయ్య ఇంటి కెళ్లిపోయాను.

★★★

ఆ సాయంత్రం నేనెక్కిన టాక్సీ ఆ ఇంటి ముందు ఆగేసరికి నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. షామియానాలో సన్నాయి మోగుతోంది. ఇల్లు చాలా రిచ్‌గా అలంకరించబడి వుంది ఫ్లవర్ డికొరేషన్ తాలూకు పరిమళం గాలిలో నిండిపోయి ఆహ్లాదంగా వుంది. సీరియల్ లైట్స్‌తో దసరాకి అలంకరించిన మైసూరు పేలస్‌లా వుందా ఇల్లు.

వీధంతా నిండిపోయిన కార్లు పార్కింగ్ ప్లేసు కోసం దిక్కులు చూస్తున్నాయి. వేరే ఎడ్రస్ కొచ్చానా అని నేను సంశయిస్తూండగా గేట్లోంచి గబగబా నడుచుకుంటూ వస్తున్నాడు మూర్తి.

పొందూరు ఖద్దరు సిల్కు పంచె కట్టుకుని, పొడవు చేతుల లాల్చీ, పై మీది జరీ కండువాను సవరించుకుంటూ కారులోకి తొంగి చూసి ''వచ్చేసావా శృతీ! టెలిగ్రాం ఇచ్చాను అందుతుందో లేదో, వస్తావో రావో అనుకుంటున్నాను. స్రవంతి పెళ్లి ఇంటి దగ్గరే

జరిపించేస్తున్నాను. దానిష్టం ఎందుకు కాదనాలి, ఏమంటావ్?'' అంటూ నుదుటికి పట్టిన చెమటను అద్దుకున్నాడు.

అంతలో మా వెనుక వచ్చి ఆగిన మరో కారును రిసీవ్ చేసుకుంటూ ''శృతీ! నువ్వు లోపలికి పద. సరోజ లోపలుంది'' అంటూ అటు నడిచాడు.

మూర్తి భార్య సరోజ ఎదురొచ్చి నన్ను పలకరించింది. పెళ్లి టైం కావడంతో నన్నొక చోట కూర్చోబెట్టి హడావుడిగా వెళ్లిపోయింది.

ఎవరో తెచ్చిన కూల్ డ్రింక్‌ని సిప్ చేస్తూ కూర్చున్నాను. నా కళ్లుమాత్రం మూర్తినే గమనిస్తున్నాయి. ఎక్కడ చూసినా తనే అయి మూర్తి ఒకటే హడావుడిగా తిరుగుతున్నాడు. పకపకా నవ్వుతున్నాడు. మధ్యమధ్యలో సరోజ దగ్గరికి వెళ్లి ఏదో సలహా అడుగుతున్నాడు.

పది రోజుల క్రితం నాకుత్తరం వ్రాసిన మూర్తి ఇతనేనా అని డౌటొచ్చింది నాకు . నా ముందు కూర్చున్న ఎవర్నో పలకరించడానికొచ్చాడు మూర్తి.

ఆయన మూర్తి చేయందుకుని ''హలో ఏంటీమధ్య హార్టెటాక్ వచ్చిందట, అపోలోలో వున్నారట, నేనూళ్లో లేను. బిజినెస్ టూర్ కల్‌కట్టావెళ్లాను'' అంటున్నాడు.

'' ఆ...అవునండి, అమ్మాయి పెళ్లికదా ఎటాక్ అని పడుకుంటే ఎలాగ?'' పెద్దగా నవ్వుతున్నాడు మూర్తి.

''పాపం, ఈ మధ్యనే మీ అమ్మగారు పోయారట, ఇంతలోనే ఈ పెళ్లిలా పెట్టు కున్నారు.?

మూర్తిముఖంలో నవ్వు చెరగలేదు. ''చూడండి రామారావ్‌గారూ! పెద్దావిడ, కాలం తీరిపోయింది. వెళ్లిపోయింది. పుణ్యాత్మురాలు. గతించి పోయిన కాలం కోసం భవి ష్యత్తును ఆపుకుర్చోం కదా!''

''అవునవును'' అంటున్నాడాయన.

నా కర్థమైంది. మూర్తి నాకుత్తరం రాసే సరికి స్మశాన వైరాగ్యం నుంచి బైటపడ లేదు. ఇపుడు మళ్ళీ మామూలు మనిషై పోయాడు. అతని కోసం పరుగెత్తుకొచ్చిన నా సెన్సిటివ్‌నెస్‌కి నా పై నాకే చికాకనిపించింది.

ఒక్క జెర్క్‌తో ట్రెయిన్ కదిలి స్పీడందుకుంది. ఉత్తరాన్ని చింపి బైటికి విసిరేశాను.

*(4-11-90 ఆదివారం ఆంధ్రజ్యోతి)*